క్లుప్తంగా

ఘనంగా పడిపూజ



మెట్ల పూజలు చేస్తున్న గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: అయ్యప్ప విషు పూజ మహోత్సవం సందర్భంగా యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. శ్రీ అద్దెంకి సారంగ చారి గురుస్వామి ఆధ్వర్యంలో 18 మెట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 18 పడులను వెలిగించారు. ఆలయ అర్చకులు భక్తులకు హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి ఉత్సవాలు



మొక్కులు చెల్లిస్తున్న కొప్పుల స్నేహలత

ధర్మారం: మండలంలోని మల్లాపూర్‌లో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం నాగవెల్లి పట్నాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గందం వరలక్ష్మి, మాజీ సర్పంచ్ గందం రవీందర్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్

కమాన్‌పూర్: మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్‌లోని కృష్ణ ఆర్థోపెడిక్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగపెల్లి అజయ్, నాయకులు మచ్చగిరి రాము, మట్ట శంకర్, మల్లారపు అరుణ్, బర్ల సదానందం, లింగస్వామి, విశ్వతేజ, సతీశ్, కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి



చెక్కు అందిస్తున్న ఎంపీపీ రేణుకాదేవి

ఓదెల: కల్యాణలక్ష్మి ఆడపడుచులకు అండగా ఉందని ఎంపీపీ కునారపు రేణుకాదేవి అన్నారు. ఆదివారం మండలంలోని బాయమ్మపల్లె, ఇందుర్తి, శానగొండ, రూపునారాయణపేట, పొత్కపల్లి గ్రామాల్లో 11 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుసమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు, ఎంపీటీసీ జీల తిరుపతి, సర్పంచులు తొల్పూరి కొంరయ్య, అంబాల సంధ్యారాణి, సునీత, చిరంజీవి, ఆళ్ల రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని బుధవారంపేట గ్రామానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ దేవునూరి రజిత పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన బావు కొమురయ్యకు రూ. 34,500, బుద్దార్థి రాజయ్యకు రూ.24 వేలు, మడిపల్లి సుగుణకు రూ.7 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరు కాగా, సర్పంచ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేశ్, వార్డు సభ్యులు కుమార్, కావ్య, నాయకుడు దేవునూరి శ్రీనివాస్, పాల్గొన్నారు.

మంథని: ముత్తారం మండల కేంద్రానికి చెందిన మబ్బు పద్మకు మంజూరైన లక్ష రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆదివారం సర్పంచ్ తూటి రజిత అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు అనుమ సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు తీర్చేదెవరో ?

- మరమ్మతు పనులను ముందుకు రాని పంచాయతీలు
- తమకు సంబంధం లేదంటున్న మిషన్ భగీరథ అధికారులు
- ధర్మారంలో 15 రోజులుగా నిలిచిపోయిన నీటి సరఫరా

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు కావటంలేదు. ఇంటింటికీ సురక్షితమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యంతో ఇంటింటికీ తాగునీరు అందడం లేదనే ఆరోపణలున్నాయి. గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలిపోయి నీటి సరఫరా నిలిచిపోయినప్పటికీ ఆయా గ్రామ పంచాయతీలు కానీ, సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు రావటం లేదు. ధర్మారం మండలంలో పలు గ్రామాల్లో ఈ సమస్య ఉంది. 15 రోజుల క్రితం మండల కేంద్రంలోని దాదాపు 400 కుటుంబాలకు నీటి సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోయింది. మరమ్మతు పనులు చేపట్టేందుకు పంచాయతీ గానీ, మిషన్ భగీరథ అధికారులు ముందుకు రాకపోవడంతో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. దీనిపై కో ఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ నీటి సమస్యపై ఎంపీడీవోకు ఫిర్యాదు చేయగా స్పందించిన ఎంపీడీవో మిషన్ భగీరథ డీఈఈ, ఏఈఈతో పాటు పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి త్వరగా పనులు నీటి సమస్యను తీర్చాలని సూచించారు. అయినప్పటికీ ఎవ్వరూ ముందుకు రాలేదు. కాగా మిషన్ భగీరథ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు పూర్తిచేసినప్పటికీ సంబంధిత అధికారులు ఈ పనులను గ్రామ పంచాయతీలకు అప్పగించలేదు. దీంతో తాము పనులు చేస్తే బిల్లులు తీసుకునే అవకాశం లేదని సర్పంచులు స్పష్టం చేస్తున్నారు.



ధర్మారంలోని మిషన్ భగీరథ ట్యాంకు

పదిహేను రోజులుగా మంచినీరు రావటం లేదు



15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావటం లేదు. దీంతో మంచినీటికి ఇబ్బందవుతుంది. రోజూ నీటి కోసం ఎదురుచూస్తున్నాం. పగిలిపోయిన పైప్‌లైన్‌ను బాగుచేస్తలేరు. పంచాయతీ సిబ్బందిని అడిగినా సరైన సమాధానం చెప్పటం లేదు.

– కొత్తపల్లి శైలజ, ధర్మారం

నీటి కోసం తిప్పలు పడుతున్నాం



నీటి కోసం తిప్పలు పడుతున్నాం. గుట్టపైన ఇల్లు ఉంది. బోర్‌వెల్ నీటిపై ఆధారపడుతున్నాం. కానీ బోర్‌లో నీరు సరిగా రావటం లేదు. సర్పంచ్ ట్యాంకర్‌తో నీటిని పంపిస్తున్నారు. తాగునీటితో పాటు ఇతర అవసరాలకు కూ లీకి బంద్ చేసి దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం. తొందరగా పైప్‌లైన్ మంచిగా చేయించాలి.

– ఎదుల్లా రాజేశ్వరి

బిందెడు నీళ్లు కూడా దొరకడం లేదు



మిషన్ భగీరథ నీరు రాకపోవటంతో దూరంగా ఉన్న బోర్ వద్దకు వెళ్లి తీసుకవస్తామంటే బోర్‌లో కొట్టంగా కొట్టంగా నీరు వస్తోంది. బిందే నీటికోసం అరగంట కష్టపడుతున్నాం. దీంతో ఉదయం పిల్లలను బడికి పంపించలేకపోతున్నాం. పైప్‌లైన్ బాగు చేసి నీరందించాలి.

– చెదమాకి లక్ష్మి

రైతులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి
- అభివృద్ధి పనులు ప్రారంభం

సుల్తానాబాద్: రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం కాసులపల్లిలో కొమ్ము అంజి ఇటీవల మృతి చెందగా, ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల బీమా పత్రాన్ని మృతుడి అక్క కొమ్ము శారదకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బండారి స్రవంతి, మండల పార్టీ అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, రైతు సమితి మండలాధ్యక్షుడు అనంత రెడ్డి,యూత్ మండలాధ్యక్షుడు కొయ్యడ విక్రం, సర్పంచ్ దాసరి పద్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఎలిగేడు: మండలంలోని నారాయణపల్లి గ్రామానికి చెందిన చింతిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుండెపోటుతో, రాములపల్లికి చెందిన తీట్ల వెంకటయ్య, గొల్లె పోచాలు, ఎలిగేడుకు చెందిన కవ్వంపల్లి నాగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాలను ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి పీఏసీఎస్ చైర్మెన్ గోపు విజయబాస్కర్‌రెడ్డి, సర్పంచులు నాయకులు ఉన్నారు.

గంగపుత్ర భవనం ప్రారంభం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టిపల్లిలో గంగపుత్ర సంఘం(బెస్త) భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



బీమా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే దాసరి

వైభవంగా సుదర్శన హోమం

ఓదెల: మండలంలోని కొలనూర్ సంతాన వేణు గోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం సుదర్శన హోమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజారులు మల్లోజుల ప్రవీణ్‌శర్మ, ప్రతాపురం రామాచార్యులచే నాలుగు గంటల పాటు సుదర్శన హోమం కార్యక్రమం జరిగింది. సుల్తానాబాద్, కొలనూర్, గోపరపల్లె, ఉప్పరపల్లె, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ గ్రామాల నుంచి భక్తులు హోమంలో పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో హాజరై తీర్థప్రసాదములు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హోమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, సర్పంచ్ సామ మణెమ్మ, ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్, ఉపసర్పంచు పాకాల సంపత్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కలకొండ రాజిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

యాసంగి వరికోతలు షురూ..



ప్రారంభానికి ముందే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులు

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో యాసంగి వరికోతలు ప్రారంభమయ్యాయి. బసంత్‌నగర్, పాలకుర్తి, కొత్తపల్లి, పుట్నూర్, కుక్కలగూడుర్, కురుమపల్లి గ్రామాల్లో వరికోతలు నాలుగు రోజులుగా కొనసాగుతున్నాయి. కోతలు పూర్తి చేసిన రైతులు ఆయా గ్రామాలకు సంబంధించిన ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి ఆరబోస్తున్నారు. మరికొంత మంది రైతులు సమీపంలోని రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించి అమ్ముకుంటున్నారు. మండల వ్యాప్తంగా ప్రస్తుత యాసంగి సీజన్‌లో దాదాపు 11 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగుచేశారు. వర్షాకాలం సీజన్‌తో పోలిస్తే ప్రస్తుత పంట దిగుబడి ఆశాజనకంగానే ఉన్నట్లు రైతులు అంటున్నారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గత సీజన్‌లో ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2060, కామన్‌గ్రేడ్ ధాన్యానికి రూ.2040 మద్దతు ధర చెల్లించనున్నారు.

బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ. 45 లక్షలు మంజూరు

ధర్మారం: మండలంలోని పలు గిరిజన గ్రామాల అభివృద్ధిలో భాగంగా గిరిజన సంక్షేమశాఖ నుంచి బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.45 లక్షల నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సిఫారసు మేరకు మండలంలోని బంజేరుపల్లి తండా బీ గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు, కమ్మరిఖాన్‌పేట తండాకే గ్రామానికి రూ. 20 లక్షల నిధులు గిరిజనశాఖ నుంచి మంజూరైనట్లు ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ తెలిపారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రాధారెడ్డి

కమాన్‌పూర్: మహిళా కాంగ్రెస్ రామగిరి మండల అధ్యక్షురాలిగా పబ్బతి రాధారెడ్డిని ఏఐసీసీ కార్యదర్శి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నియమించినట్లు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తిరుపతి యాదవ్ సూచించారు.

భానుడి ఉగ్రరూపం

కాల్వశ్రీరాంపూర్: వామ్మో ఏప్రిల్ నెలలో ఇత వేడి ఎన్నడూ చూడలేదంటున్నారు. మాడ పగిలి పోయే ఎండలు తట్టుకునేదెలా.? మే నెలలో కొట్టాలిసిన ఎండలు ఇప్పుడే దంచి కొడుతున్నాయి. భానుడి వేడికి 144 సెక్షన్ విధించినట్లు వీధులు 12 గంటలకే నిర్మానుష్యంగా ఉంటున్నాయి. సాయంత్రం 4 గంటల వరకు ఎవ్వరూ బయటికీ రావడంలేదు. చిన్నపిల్లలు, వృద్ధులు వేసవి ఎండలకు తట్టుకోలేక పోతున్నారు. తప్పని పరిస్థితుల్లో వ్యవసాయనులకు వెళ్లిన రైతులు, కూలీలు వేసవి తాపానికి అస్వస్థతకు గురవుతున్నారు. కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు తిరిగినా వేడిగాలితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.




నిర్మానుష్యంగా మారిన కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పలు వీధులు

తీర్మానాలు అమలయ్యేనా..?

- అధికారుల గైర్హాజరుపై తీర్మానం
- కలెక్టర్‌కు నివేదించని అధికార యంత్రాంగం
- నేడు మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: మండలంలో అభివృద్ధిపై మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాలకు పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెజారిటీ సభ్యుల తీర్మానం మేరకు అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో సమస్యలను ఎవ్వరికీ చెప్పుకోవాలని ప్రశ్నిస్తున్నారు. సమస్యలు వినని, ప్రజా సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు నిర్వహించడం ఎందుకని సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

తీర్మానాలకే సభ పరిమితం...!

ఇప్పటి వరకు 22 సమావేశాలు నిర్వహించగా, అందులో 5 ప్రత్యేక సమావేశాలను నిర్వహించారు. ఇందులో మెజారిటీ సభ్యులు చేసిన తీర్మానాలు, అమలుకు నోచుకోని ప్రధానంగా ఉన్నాయి.

- ప్రతీ సమావేశంలో 20 శాఖల అధికారులకు పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకావడం లేదని కలెక్టర్‌కు నివేదించారు.
- రూర్బన్ పథకం కింద చేపట్టిన పనులకు ఏళ్లు గడిచినా బిల్లులు రాకపోవడంతో బిల్లులు ఇప్పించాలని తీర్మానం
- రైస్‌మిల్‌ల నుంచి వచ్చే మురికినీటితో పంట పొలాలు నాశనం అవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని తీర్మానం
- కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని తీర్మానం
- మండలంలో ప్రభుత్వ సర్వేయర్‌ను నియమించాలని తీర్మానం చేశారు.
- గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను 24 గంటలు సేవలందించేందుకు అప్‌గ్రేడ్ చేయాలని తీర్మానం చేశారు.
- గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని సక్రమంగా అందించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని తీర్మానం చేశారు.

కానీ ఇప్పటివరకు ఏ ఒక్క తీర్మానం కూడా పరిష్కారం కాలేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో అధికారులు పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సర్పంచ్‌లు,ఎంపీటీసీలు కోరుతున్నారు. నేడు నిర్వహించే సమావేశంలోనైనా పూర్తి స్థాయిలో అధికారులు పాల్గొనాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్‌కు నివేదిక

సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై సభ్యుల తీర్మానం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదిక అందించాం. అలాగే సభలో చేసిన ప్రతి తీర్మానం అమలు అయ్యేందుకు కృషి చేస్తున్నాం.

– శశికళ,ఎంపీడీవో, సుల్తానాబాద్

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష

ఎలిగేడు: గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకుని క్రీడల్లో రాణించాలని పెద్దపల్లి బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని ముప్పిరితోటలో బీఎస్పీ మండల అధ్యక్షుడు మారం సతీశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం దాసరి ఉష ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకరావడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను గుట్టల్లో, చెట్లల్లో పుట్టల్లో దేనికి పనికి రాకుండా ఉన్న ప్రదేశాల్లో ఏర్పాటు చేసిందని ఆరోపించారు. క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. మొదటి బహుమతి రూ.25,000, రెండో బహుమతి రూ.15,000, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.5,000 చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దొల్ల ఐలయ్య, ఉపసర్పంచ్ చీకటి శైలజ, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జీ బాలకళ్యాణ్ పంజా, జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, జిల్లా కార్యవర్గసభ్యుడు కాంపెల్లి బాబు, అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ఉపాధ్యక్షుడు నల్లగోపాల్ యాదవ్,ప్రధాన కార్యదర్శి అనిల్, ఆర్గనైజర్లు, యువకులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీల సౌకర్యం కల్పించాలి



రామగుండంలోని రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్

రామగుండం: కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అన్ని రంగాల్లో నగదు రహిత లావాదేవీలు ప్రోత్సహిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండే రైల్వే శాఖలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. దేశ వ్యాప్తంగా రైల్వే బుకింగ్ కౌంటర్లలో క్యాష్ చెల్లిస్తేనే టికెట్ల విక్రయాలు జరుపుతుండడంపై ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వేశాఖలో మాత్రం నగదు రహిత లావాదేవీలు అమలు చేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణికుల అనుకూలతను దృష్టిలో ఉంచుకుని బుకింగ్ కౌంటర్లలో నగదు రహిత లావాదేవీలను అమలు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు కంటి వెలుగు వైద్య శిబిరం ప్రారంభం

జూలపల్లి: మండలంలోని కోనరావుపేటలో నేడు కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తామని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, సర్పంచ్ మంగ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జూలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో నేడు ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు తెలిపారు. సమావేశానిని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని పీజీ సెంటర్ పరిధిలోని కేసీఆర్ కాలనీ, పద్మావతికాలనీ, శారదానగర్, ప్రగతినగర్ ఏరియాల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 01:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. దేవస్వామి తెలిపారు.వినియోగదారుల సహకరించాలని కోరారు.